# చీకటి మడతలు

సరస్వతి ఆ విషయం చెప్పిన తరువాత చాలా ఆశ్చర్యపోయాను. నేనెప్పుడూ అలాంటి విషయం జరుగుతుందని ఊహించలేదు. విన్నతర్వాత కొద్దిసేపటివరకూ యీ విషయాన్ని నమ్మలేకపోయాను.

ఆమె ఏవో పరిచయాలను గురించి మాట్లాడుతున్నప్పుడు "మీపేరు నాకు చాలాకాలం క్రిందటే తెలుసు. అన్నయ్య పరిచయం చెయ్యకముందుకూడా మిమ్మల్ని బాగా ఎరుగుదును. కాలేజీలో మీ పేరు మూడు నాలుగు గదుల్లో , మేం కూర్చునే బెంచీలమీద చెక్కిఉండేది. అప్పటినుండీ మీ పేరు నాకు బాగా జ్ఞాపకం. ఆ తర్వాత అన్నయ్య మిమ్మల్ని పరిచయం చేశాడు!" అంది.

సరస్వతి, కల్పించి యీ విషయం చెప్పిందనుకోను.

నేనెప్పుడూ బెంచీలమీద నా పేరు చెక్కుకోలేదు. నా మిత్రులుకూడా నా పేరు చెక్కి ఉండరు. వారందరికీ నేనంటే గౌరవం ఉంది. ఆడవాళ్ళ బెంచీలమీద నా పేరు చెక్కాల్సిన అవసరం వాళ్ళెవరికీ లేదు.

సరస్వతి చెప్పిన విషయాన్ని గురించి ఆ తర్వాత నేను చాలాసార్లు ఆలోచించాను. ఆ అక్షరాల్ని ఎవరు చెక్కిఉంటారో ఊహించుకోలేకుండా ఉన్నాను.

కాని, తప్పకుండా వాటిని ఎవరో ఒక అమ్మాయి చెక్కిఉండాలి. ఆ అమ్మాయి ఎవరైనదీ తెలియకుండా ఉంది.

ఇప్పుడీ విషయాన్ని తెలుసుకోవడం చాలా కష్టమనిపిస్తోంది. కాలేజీ విడిచిపెట్టి సుమారు నాలుగైదేళ్ళు అయ్యింది. చాలామంది తమతమ జీవితాల్లోకి ప్రవేశించారు. ఇన్నేళ్ళ తరువాత ఆ విషయాన్ని తెలుసుకోవడంలో ప్రయొజనం ఉన్నట్టు అనిపించడంలేదు. సరస్వతయినా ముందుగా యీ విషయాన్ని చెప్పిఉండవలసింది.

ముందుగా చెప్పిఉంటే కొంతవరకూ తెలుసుకోడానికి ప్రయత్నించి ఉండేవాడిని. ఈనాడు పరిస్థితులు చేతులు దాటిపోయిన తరువాత, ఎవరో ఒకామె నన్ను ప్రేమించిందని తెలుసుకోవడంలో ఉపయోగంలేదు. ఒకరకంగా అది బాధకలిగించినా కలిగించవచ్చు.

అయితే ఈ విషయాన్ని గురించి ఆలోచించగూడదనుకున్నా అది సాధ్యం కావడంలేదు. నాకు తెలియకుండా నాగురించి యింతకథ జరిగినప్పుడు కొంతవరకైనా దీనికి కారకులెవరో తెలుసుకోవాలనే కుతూహలం నాలో అధికమైంది.

గడచిన నాలుగేళ్ళ కాలేజీ జీవితాన్ని ఏకాంతంగా కూర్చొని మననం చేసుకున్నప్పుడు అనుమానించదగ్గ వ్యక్తులెవ్వరూ నాకు కనిపించలేదు. పై సంఘటన జరిగిఉంటే బి.ఏ. చదువుతుండగా జరిగిఉండాలి. ప్రతి చిన్న సంఘటనకూ ప్రాధాన్యం యిచ్చి ఆలోచించినప్పుడు ముందుగా ఇందిర జ్ఞాపకానికి వచ్చింది.

ఇందిరతో నేనెప్పుడూ అంతగా మాట్లాడలేదు. నిజానికి ఆమె మీద నాకు ఏమాత్రం గౌరవం లేదు. అప్పట్లో ఆమె చంద్రశేఖరాన్ని ప్రేమించినట్టు వదంతి ఉండేది. తరచుగా లెక్చరర్ పాఠం చెప్తున్నప్పుడు కొద్దిసేపు ఆలకించి బొమ్మలు గీస్తూ కూర్చునేది. గుండ్రని సున్నాలో రెండు చిలకలు, పూలగుత్తులు ఆమె తరచుగా వేస్తుండే చిత్రాలు. ఆమెకు డ్రాయింగ్ చేతకాదు. అయినా తనకు వచ్చినట్టుగా గీసి నాకు కనిపించేటట్టు పెట్టేది. నేను కొద్దిగా బొమ్మలు గీస్తాననే సంగతి చాలామందికి తెలుసు. నాకు కనిపించేటట్టుగా బొమ్మల్ని గీయడంలో అర్థం యీనాడు ఊహించవలసి వస్తోంది.

జ్ఞానసుందరి అందరికన్నా చలాకీగా ఉండేది. చక్కగా పాటలు పాడేది. చివరిరోజుల్లో ఆమె రెండు మూడుసార్లు మాట్లాడింది. ఆమె ఏం మాట్లాడిందో యిప్పుడంతగా గుర్తులేదు.

ఒకసారి ఆమె చిత్రాన్ని గీశాను. అది మరో మిత్రుడు తీసుకుపోయి నాకు

తెలీకుండా ఆమె కిచ్చాడు. దానిమీద నాపేరు లేదు. ఆమె మొదట్లో తీసుకోడానికి అభ్యంతరం చెప్పింది. ఆ తర్వాత ఆ చిత్రం నేను వేసిందని తెలుసుకొని, మారుమాట్లాడకుండా తీసుకుంది. ఈ విషయాలన్నీ ఆ మిత్రుడు వచ్చి చెప్పాడు. కొద్దిరోజులతర్వాత ఒక్కడ్నీ వెడుతున్నప్పుడు ఆమె కనిపించి కృతజ్ఞత తెలియజేసింది. కొద్దిసేపు పొగిడింది. ఆ సమయంలో ఆమె ప్రయోగించిన కొన్ని వాక్యాలకు అర్థం ఆ తర్వాత రెండురోజులు ఆలోచించవలసి వచ్చింది. ఇప్పుడవన్నీ జ్ఞాపకం లేవు. ఆమె ఏమన్నదీ జ్ఞాపకం రాకుండా ఉంది.

స్నేహలత కాలేజీ జీవితం అయిపోయాకనే సన్నిహితంగా పరిచయం అయ్యింది. ఒకరోజు ఏదో మీటింగులో కనిపించి ఎంతో పరిచయం ఉన్నదానిలా మాట్లాడింది. పాత జ్ఞాపకాలు మననంచేసుకొని, 'అవి చాలా చక్కటిరోజులు' అంది. తను ఏం చేస్తున్నదీ చెప్పింది. నేను ఊహించని స్వవిషయాలు ఎన్నో ఆమె తెలియజేసింది. నేను చాలా ఆశ్చర్యపోయాను. చదువుకొనేటప్పుడు కనీసం ఒకసారైనా పలకరించు కోలేదు. తొలిసారిగా కలుసుకున్నప్పుడు ఎంతో పరిచయమైన వ్యక్తిగా, అతిసన్నిహితంగా ఆమె మాట్లాడడం విచిత్రం అనిపించింది. ఆ మరుసటిరోజు వాళ్ళింటికి ఒకసారి రమ్మంది. అడ్రసుచెప్పి 'సాయంకాలం ఎదురుచూస్తాను' అంది.

మరుసటిరోజు వెళ్ళాను. ఆమె వీధిలోనే ఉంది. నన్ను చూడగానే చిరునవ్వునవ్వి లోపలకు తీసుకొని వెళ్ళింది. వాళ్ళ తల్లిగారికి పరిచయం చేసింది. ఆ తర్వాత తర్వాత ఆమె చాలా సన్నిహితమైన వ్యక్తి అయింది.

ఈనాడు ఆమె స్నేహంలో ఏమైనా విశేషం ఉన్నదా అని ఆలోచిస్తున్నప్పుడు,ఆమె నన్ను వాళ్ళమ్మకు పరిచయం చేసిన విధానం గురించి ఆలోచించవలసి వస్తోంది. ఆమెకు పరిచయం చేస్తూ "అప్పుడప్పుడు యీయన గురించి నీకు చెప్తుండేదాన్ని కదూ" అంది. అప్పట్లో ఆ వాక్యాన్ని చాలా తేలికగా తీసుకున్నానుగాని, యీనాడు తిరిగి ఆలోచిస్తున్నప్పుడు దానివెనుక ఏమయినా అర్థం ఉండిఉండాలి అనిపిస్తోంది. నన్ను గురించి వాళ్ళమ్మతో చెప్పడం ఆశ్చర్యంగా ఉంది!

వీళ్ళుగాక మరో ఐదారుగురు నాతో కలిసి చదువుకున్నారు. అయితే వాళ్ళతో నా కేమాత్రం పరిచయం లేదు. వాళ్ళను గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. వాళ్ళపేర్లుకూడా నాకు తెలియవు.

పైన చెప్పిన ముగ్గురిలోనూ ఎవరో ఒకరు ఆ పేరు చెక్కిఉండాలి. ఈ విషయంలో నేను అనుమానించదగ్గ వ్యక్తిగా జ్ఞానసుందరి కనిపిస్తోంది. ఆ మధ్య

ఆమె రాసిన ఉత్తరం ఒకసారి బైటకుతీసి చదవాలనిపించింది. పనిమీద వైజాగ్ వెళ్ళినప్పుడు బజార్లో ఆమె కనిపించింది. వాళ్ళ నాన్నగారికి ఆవూరు ట్రాన్స్‌ఫర్ అయిందట. రెండేళ్ళబట్టి ఆ వూళ్ళోనే ఉంటున్నారట. తాను యూనివర్శిటీలో ఎమ్.ఏ చదివి ఉద్యోగం గురించి ఎదురుచూస్తున్నదట.

ఆ వూరినుంచి వచ్చిన తరువాత ఆమెకు ఉత్తరం రాశాను. వారం పదిరోజులు ఆలస్యంచేసి ఆమె జవాబిచ్చింది. మామూలుగా అన్ని ఉత్తరాలులాగే, ఆ ఉత్తరాన్నీ తీగకు గుచ్చినట్లు జ్ఞాపకం. ఆ ఉత్తరాన్ని తీసి యిప్పుడు మళ్ళీ చదువుతే ఏమైనా కొత్తవిషయాలు తెలియవచ్చనిపించింది.

పాత ఉత్తరాల్లో వెతకగా ఆమె రాసిన ఉత్తరం కనిపించింది. తీసి చదువు కున్నాను.

"సూర్యనారాయణమూర్తిగారికి -

మిమ్మల్ని యింత పెద్దపేరుతో పిలవడం కొంచెం శ్రమే అయినా, రోజూ మిమ్మల్ని పిలవవలసిన అవసరం లేదుగనుక, ఎప్పుడో ఒక్కొక్కప్పుడు యిలా వుత్తరాల్లో పలకరించే మిమ్మల్ని, మీ పూర్తి పేరుతో పిలిచేందుకు కొంచెం శ్రమపడినా ఫరవాలేదనిపిస్తోంది. ఒకసారి అలా పిలుస్తే అభ్యంతరం చెప్పారు. అంత శ్రమపడి పూర్తిపేరుతో పిలవవలసిన అవసరం లేదని, సింపుల్‌గా చివరి రెండక్షరాలతోనూ పిలవమన్నారు. నాకు శ్రమ కలిగించకూడదనుకునే మీ అభిమానానికి కృతజ్ఞతలు. ఈ విషయాన్ని మీరు ఇంకొంత ముందుగా తెలియజేసి ఉంటే బావుండేది. ఈనాడు మిమ్మల్ని మీ పూర్తిపేరుతోనే పిలవాలని వుంది. అందుకు నాకు శ్రమేమీలేదు.

జీవితంలో మీరు చాలా ఉన్నతమైనస్థానంలోకి వెళ్ళగలిగారు. అందుకు మిమ్మల్ని అభినందించాలి. గెలుపును, ఓటమిని ఒకేదృష్టితో తీసుకుంటారు. చాలా అదృష్టవంతులు మీరు. మీకు బాధలు వుండవు. సమస్యలు వుండవు. మీలాంటి దృష్టి లేకపోవడం నా బలహీనత. ఓటమిని మర్చిపోలేను. జీవితంలో గాలిమేడలైపోయిన కోరికల్ని పదేపదే తలంచుకొని కుమిలిపోతుంటాను. మీలా సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిలేదు. పిరికిదాన్ని. నా భవిష్యత్తు నాకే భయంగా ఉంటోంది. ఇకముందు మిమ్మల్ని అనుసరించేందుకు ప్రయత్నిస్తాను.

కొన్ని విషయాల్లో తప్ప యిక్కడి జీవితం చాలా సంతోషంగానే గడిచిపోతోంది. యూనివర్శిటీలో గడిపిన రోజులు చాలా విలువైనప్పటికీ కాలేజీ రోజుల్ని మర్చిపోలేక

పోతున్నాను. ఆ జీవితంలో ఒక ప్రత్యేకత వుంది.

ప్రస్తుతం నేను ఉద్యోగం చెయ్యాల్సిన అవసరంలేదు. కాని చెయ్యడంలో ఒక ఆనందం ఉన్నదనిపిస్తోంది. అందుకై ప్రయత్నిస్తున్నాను. వీలు చూసుకుని జవాబు రాయండి. మీ ఉత్తరం గురించి ఎదురుచూస్తుంటాను.

జ్ఞానసుందరి"

ఉత్తరం మీద తారీఖు చూశాను. ఎప్పుడో పన్నెండు నెలల క్రిందటి ఉత్తరం అది. ఉత్తరం చదివాక నా అనుమానానికి మరికొంత బలం వచ్చింది. కాని ఆ తర్వాత ఆమె వద్దనుండి ఉత్తరాలు లేకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ఆమె కోరినట్లుగా అప్పట్లో ఆమెకు ఉత్తరం రాశాను. కనీసం అందుకున్నట్టయినా సమాధానం రాలేదు. మళ్ళీ ఆమెకు ఎప్పుడూ ఉత్తరాలు రాయలేదు.

ఈనాడు మళ్ళీ ఆమెకు ఉత్తరం రాయాలనిపించింది. పాత అడ్రసుకు ఆమె క్షేమసమాచారాల్ని తెలపవలసిందిగా కోరుతూ ఉత్తరం రాశాను. ఆఉత్తరం రెండు వారాల తర్వాత తిరిగి నాకే వచ్చింది.

ఒకరోజు చంద్రశేఖరం వచ్చాడు. శుభలేఖ ఇచ్చి "నా పెళ్ళికి తప్పకుండా రావాలి సుమా" అన్నాడు.

శుభలేఖ అందుకొని, విప్పిచూడకుండానే "ఎవరు?.... ఇందిరతోనేనా?" అన్నాను నవ్వుతూ.

అతను పేలవంగా నవ్వేసి "కాదులే" అన్నాడు. ఆ విషయంమీద అతన్ని యింకేమీ ప్రశ్నించదలచుకోలేదు. జరిగినది ఊహించగలను.

చంద్రశేఖరం పెళ్ళికి ఇందిరకూడా వచ్చింది. ఆమె వస్తుందని నేను అనుకోలేదు. ఎదురుపడినప్పుడు ముందుగా ఆవిడే పలకరించింది.

పెళ్ళి హడావిడిలో అప్పుడు ఇందిరతో ఎక్కువగా మాట్లాడలేకపోయాను. పెళ్ళయిన రాత్రిబండికే ఆమె వెళ్ళిపోతానంది. ఆ సాయంకాలం యింటికి రమ్మని ఆహ్వానించాను. సరే అంది. సాయంకాలం అయిదు దాటిన తర్వాత నేనే వెళ్ళి తీసుకొచ్చాను.

కాఫీ తెచ్చి యిచ్చాను.

ఆమె అభ్యంతరం చెప్పింది. కాఫీ టీలు తాగడం మానేసి సంవత్సరం

పైబడిందట. నన్ను కూడా మానేయమంది.

నవ్వుకున్నాను.

ఈమధ్య ఆమె చాలా ఊళ్ళు వెళ్ళిందట. ఆ విషయాలన్నీ చెప్పింది. కలకత్తాలో గోపాలం కనిపించాడట. ఆమెతోపాటు రాయఘడ్ వరకూ వచ్చి మళ్ళీ వెనక్కు వెళ్ళిపోయాడట. హైదరాబాదు వెళ్ళినప్పుడు స్నేహలతను కలుసుకున్నదట. అప్పటికి స్నేహలత యిద్దరు పిల్లల తల్లట.

ఆ విషయాలన్నీ వినడంలో నాకేమీ ఉత్సాహం లేదు. అయినా ఆలకిస్తున్నాను.

"మీరెప్పుడు పెళ్ళిచేసుకుంటారు"? అంది మాట్లాడుతూ మాట్లాడుతూ.

"ఏమో చెప్పలేను" అన్నాను.

విచిత్రంగా నా వైపు చూసింది. "అసలు పెళ్ళే చేసుకోరా?" అంది తిరిగి.

ఆమె అడిగిన ప్రశ్నకు నవ్వు పుట్టుకొచ్చింది. "చేసుకోకుండా ఉండలేనేమో" అన్నాను.

ఆమె ప్రసంగం మార్చేసింది. "మీరు చాలా మారిపోయారు" అంది.

ఈ రకపు సంభాషణ పాతదానిలా అనిపించింది నాకు. చాలామంది నోటిమీదుగా యీ వాక్యాన్ని విన్నాను. ఆమె దృష్టిలో 'మార్పు' అనే పదానికి అర్థం ఏమై ఉంటుందో నాకు తెలీదు. మెల్లగా నవ్వి ఊరుకున్నాను. ఆమె కూడా మౌనంగా కూర్చుంది.

"ఇంకా మీరు బొమ్మల్ని గీస్తున్నారా?" అన్నాను మౌనాన్ని నెట్టేస్తూ. ఆమె ఒకమారు తల పైకెత్తి దించుకుంది. సమాధానంమాత్రం యివ్వలేదు.

జ్ఞానసుందరి గురించి ఆమెను అడిగితే ఏమన్నా చెప్తుందేమో అనిపించి అడిగాను.

ఈ ఊరినుంచి వెళ్ళిపోయాక ఆమెను గురించిన సంగతులేవీ ఇందిరకు తెలియవట.

"మీరంటే ఆమెకు చాలా అభిమానం" అంది ఇందిర. ఆమె అలా అంటుందని నేను ఊహించలేదు. 'ప్రేమ' అనే పదానికి బదులు 'అభిమానం' అనే పదం వాడిందేమో అనిపించింది.

"అందులో ఏమన్నా ప్రత్యేకత ఉన్నదా?" అన్నాను.

"ప్రత్యేకత ఉన్నదని నేనూ అనలేను. కాని అప్పుడప్పుడు మిమ్మల్ని పొగుడుతుండేది" అంది మెల్లగా నవ్వి.

ఆమె అలా నవ్వడం ఏమీ బావుండలేదు. అయినా అదేమీ గుర్తించనట్టు "నన్ను పొగడడం చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇంతకూ ఆమె ఏమని పొగిడేది?" అన్నాను.

"ఏమో ఏమని పొగిడేదో నాకూ తెలీదు. కళావతి నాతో అప్పుడప్పుడు చెప్తుండేది, ఆమె ఎదుట పొగుడుతుండేదట" అంది.

"కళావతి ఎవరు?"

"కళావతి మనతోనే చదువుకుంది. తరచుగా నాతోపాటే తిరుగుతుండేది. మీకు జ్ఞాపకమే అనుకుంటాను. ఎకనామిక్సులో తరచుగా ఆమెకు ఫస్టుమార్కులు వస్తుండేవి" అంది.

ఆమె చెప్పిన తర్వాత జ్ఞాపకం వచ్చింది, కళావతి అంటే - ఎర్రగా, పొట్టిగా వుండే కళ్ళద్దాలు పెట్టుకునే అమ్మాయి.

"ఆమె యిప్పుడు ఎక్కడ ఉంటోంది?" అడిగాను. బహుశా ఆమె ఈ ఊర్లోనే ఉంటే ఎలాగో ప్రయత్నించి వివరాలు సేకరిద్దామని. కాని ఆమె ఈ ఊళ్ళోలేదట. ఇప్పుడు ఎక్కడుంటున్నదీ ఇందిరకుకూడా తెలియదట. పెళ్ళయిన తర్వాత భర్తతో వెళ్ళిపోయిందట.

ఇందిర చెప్పిన విషయం జ్ఞానసుందరి మీద ఉన్న నా అనుమానాన్ని మరీ బలపరిచింది. జ్ఞానసుందరే చెక్కి ఉండాలి అన్న అభిప్రాయానికి బలం చాలావరకు చేకూరింది. ఇందిర యింకా ఏమన్నా చెప్తుందేమోనని ప్రయత్నించాను కాని యింకేమీ చెప్పలేదు. అంతకుతప్పించి యింకేమీ ఆమెకు తెలియదట.

ఆరోజు రాత్రిబండికే ఇందిర వెళ్ళిపోయింది. కూడా స్టేషనుకు వెళ్ళాను.

బండి రెండుగంటలు ఆలస్యం. వెయిటింగ్ రూంలో ఆమె కూర్చుంది. నేను బయట అటూ ఇటూ పచార్లు చేస్తున్నాను. అయిదు నిమిషాలు కూడా కాలేదు. ఆమె నా దగ్గరకు వచ్చి "ఇలా వంటరిగా కూర్చుంటే ఏమీ తోచడం లేదు. అలా వెళ్ళి మాట్లాడుకుందాం రండి" అంది.

ఇద్దరం వెళ్ళి ప్లాట్‌ఫారం చివర సిమెంటు బెంచీమీద కూర్చున్నాం.

మాట్లాడుకుందాం అని తీసుకువచ్చి చాలాసేపు ఏమీ మాట్లాడకుండానే

కూర్చుండిపోయింది ఆమె. నేనుకూడా మాట్లాడేందుకు ఏమీలేక గోళ్ళు గిల్లు కుంటున్నాను.

"గోపాలం మీ గురించి చాలా చెప్పాడు. అతనికి మీరంటే చాలా అభిమానం" అంది చాలాసేపటికి, ఆమె ఆ విషయం చెప్పాల్సిన అవసరం కనిపించలేదు. మెల్లగా నవ్వి ఊరుకున్నాను.

"అతను ప్రస్తుతం కలకత్తాలో మందుల కంపెనీలో పనిచేస్తున్నాడట." అంది.

నా కెందుకో ఆమె అతని గురించి మాట్లాడ్డం అప్రస్తుతంగా తోచింది. ఆమె 'దూరంగా వెళ్ళి మాట్లాడుకుందాం రండి' అన్నప్పుడు యీ రకంగా మాట్లాడుతుందని అనుకోలేదు. ఆమె ఏవో కొన్ని రహస్యాల్ని చెప్తుందేమో అనుకున్నాను. కాని అలాకాకుండా ఆమె గోపాలాన్ని గురించి మాట్లాడ్డం ఆశ్చర్యం అనిపించింది. ఇందువల్ల ఆమెకు వచ్చే ప్రయోజనం ఏమిటో నాకు బోధపడలేదు.

"బహుశా అతనంటే మీకు మంచి అభిప్రాయం లేనట్టుంది" అంది ఆమె, నేనాలోచించడం చూసి.

నిజానికి నాకు అతనిమీద ఎంతమాత్రం మంచి అభిప్రాయంలేదు. చదువుకునే రోజుల్లో ఆడవాళ్ళ వెంటబడి ఏడిపించేవాడు. ఎవరో అమ్మాయి పేరుచెప్పి, ఆ అమ్మాయి తనను/ప్రేమిస్తోందని చాటుకునేవాడు. ఒకసారి ప్రిన్సిపాల్ పిలిచి గట్టిగా మందలించడం కూడా జరిగింది. ఆ రోజుల్లో అతను ఇందిరను కూడా ఏడిపించేవాడు.

చంద్రశేఖరం గురించి ఆమెను అడగాలనుకున్నాను. కాని ఆమె ఏమనుకుంటుందో అని అడగలేదు.

ఆమె బండి వచ్చేవరకూ పొడిపొడిగానే మాట్లాడింది. బండి వచ్చింది. సామాను తెచ్చుకుని లోపలకు ఎక్కింది. స్థలం చూసుకొని తలుపు వద్దకు వచ్చి నుంచుంది. నేను ప్లాట్‌ఫారం మీద నుంచొని బండి కదిలితే వెళ్ళిపోవచ్చని ఎదురు చూస్తున్నాను.

"పెళ్ళికి నన్ను పిలుస్తారా?" అంది ఆమె.

ఆమె మాటలు నా కెందుకో కటువుగా అనిపించాయి. ఈ రకంగా మాట్లాడేవారంటే నాకసహ్యం. మాటలతో ఎదుటివారి మనసుల్ని నొప్పిస్తుంటారు.

"పిలవనని ఎలా అనుకుంటున్నారు?" అన్నాను. ఆమె నవ్వి "వట్టినేలెండి, మీ పెళ్ళికి రాకుండా వుంటానా" అంది.

బండి కదిలింది. ఆమె పెట్టెలోంచి ముందుకువంగి, "ఏలు చూసుకుని

మావూరు ఒకసారి రండి" అంది.

"అలానే" అన్నాను.

బండి దూరంగా వెళ్ళిపోయింది. నాకు తెలియకుండానే నేనామె గురించి బాధపడ్డాను. ఆ విషయం ఆలోచించినప్పుడు ఆశ్చర్యం కలిగింది.

ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత నా శ్రేయోభిలాషులకు నన్ను ఒంటరిగా వుంచడం యిష్టంలేకపోయినట్టుంది. వారంతా కలిసి నా వివాహ ప్రసక్తిని తీసుకొచ్చారు. మునుపటిలా యీసారి తప్పించుకోవడం సాధ్యం కాలేకపోయింది. ఇప్పట్లో నేను ఏ ఆటంకం చెప్పినా, నేను పాడైపోతున్నానని భావించేస్థితిలో వున్నారు. వాళ్ళే , సంబంధం వెతికి శుభలేఖలు అచ్చు వేయించారు.

పెళ్ళికి బాగా సన్నిహితులైనవారు తప్ప ఎక్కువమంది కాలేజీ మిత్రులు రాలేదు. చాలామంది గ్రీటింగ్స్‌తో తమ బాధ్యతల్ని వదల్చుకున్నారు.

ఇందిర తప్పకుండా పెళ్ళికి వస్తుందని ఎదురుచూశాను. కాని, ఆమె రాలేదు. తను రాలేకపోతున్నందుకు క్షమాపణ చెప్పుకుంటూ మూడుపేజీల ఉత్తరం రాసింది. ఆమె రాలేకపోవడానికి పెద్దకారణంకూడా లేదు. వాళ్ళ అక్కయ్య డెలివరీకి వచ్చిందట. తను తప్పకుండా అక్కడ ఉండాలిట!

ఆమె రాకపోయినందుకు అంతగా బాధపడేవాడిని కాదు గాని, తనంతట తాను తప్పకుండా వస్తానని చెప్పి రాకపోవడం చాలా బాధ కలిగించింది. పెళ్ళయిన తర్వాత ఆమెకు పెద్ద ఉత్తరం రాశాను. అది చదువుకున్నప్పుడు ఆమె బాధపడుతుందని నాకు తెలుసు. ఆమెనుండి దానికి జవాబు రాలేదు. వస్తుందనికూడా నేను అనుకోలేదు.

పెళ్ళయిన తరువాత వీలుచూసుకుని తిరుపతికొండకు వస్తారని యింట్లో మొక్కుకున్నారట. ఆరునెలలయ్యాక యిద్దర్నీ కలిపి ప్రయాణం కట్టించారు. ఉద్యోగానికి మూడు రోజులు శెలవుపెట్టి ఆవిడతో బయలుదేరాను.

వెళ్ళినరోజు కాస్త హడావిడిగా ఉంది. కొలనులో స్నానం చేసి వద్దామని వెళ్ళాం. నీళ్ళు పచ్చగా నాచు పట్టివున్నాయి. ఎలాగో శరీరాల్నీ, బట్టల్నీ తడుపుకొని బయటికి వచ్చాం. ఆమె తల ఆరబెట్టుకొంటోంది. నేను వట్టినే చూస్తూనుంచున్నాను. తడిబట్టల్లో ఆమె చాలా అందంగా వుంటుందనిపించింది. ఆమె అందాన్ని చాలా రకాలుగా ఊహించుకొంటున్నాను.

ఎవరో పిలిచినట్టనిపిస్తే ముందకు చూశాను. స్నేహలత! చిరునవ్వు నవ్వుతూ

దగ్గరకు వచ్చింది. చంకలో ఏడాది పిల్లవాడున్నాడు. కూడా మూడేళ్ళపిల్ల చెంగుపట్టుకొని వచ్చింది. వెనుక వాళ్ళాయన గాబోలు, అతనుకూడా దగ్గరకు వచ్చాడు.

అప్పటికీ యిప్పటికీ స్నేహలతలో చాలా మార్పు కనిపించింది. వెంటనే గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ఆమె దగ్గరకు వచ్చి పలకరించకపోతే ఎవరా అని కొద్దిసేపు ఆలోచించవలసి వచ్చేది. చదువుకొనేటప్పుడు యింతలావు వుండేది కాదు. ముఖంలో పెద్ద ముత్తయిదువ పోలికలు కనిపించాయి. తడిజాకెట్టు బింకంగా ఆమె దండల్ని నొక్కి పడుతుండడం చూసినప్పుడు, ఆ లావు ఆమెకు తగదు అనిపించింది.

వాళ్ళ ఆయన్ను నాకు పరిచయం చేసింది. ఆవిడను వాళ్ళిద్దరికీ పరిచయం చేశాను. పెళ్ళికి రాలేకపోయినందుకు ఏమీ అనుకోవద్దంది. అందుకు ఏవో కారణాలు చెప్పింది.

వాళ్ళు ఎందుకు వచ్చినదీ ఆమె చెప్పింది. చంటాడికి అక్కడే తల వెంట్రుకలు తీయిస్తామన్నారట. అందుకని వచ్చారట. అక్కడ వాళ్ళకు తెలిసిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ఎవరో ఉన్నారట. అతని ద్వారా వేగంగా పని తెముల్చుకోవచ్చంది. మమ్మల్నికూడా వాళ్ళతోపాటే రమ్మంటే వెళ్ళాం.

మధ్యాహ్నానికి పనంతా పూర్తయిపోయింది. గదిలోకూర్చుని తాపీగా ప్రయాణపు విశేషాల్ని గురించి మాట్లాడుకొంటున్నప్పుడు స్నేహలత వచ్చింది. ఆ చుట్టుపట్ల ఏవో గుడులు ఉన్నాయట, చూసివద్దాం రమ్మంది. వాళ్ళతోపాటు బయలుదేరాం.

పాపను వాళ్ళ నాన్నగారు ఎత్తుకొన్నారు. స్నేహలత చంటాడిని ఎత్తుకొంది. మొదటినుంచీ చూస్తూనే వున్నాను, ఆమె చంటాడిని చంక మార్చలేదు. ఆయనమాత్రం పాపను పదిసార్లయినా దింపి వుంటారు! ఆమె ఓర్పుకు ఆశ్చర్యం వేసింది.

సాయంకాలానికి విడిది చేరుకున్నాం.

రాత్రి భోజనాలైన తరువాత వాళ్ళుకూడా వచ్చి కూర్చున్నారు. మరుసటిరోజు ఉదయం వెళ్ళిపోతున్నామని చెప్పాను. వాళ్ళుకూడా అదే అభిప్రాయంలో ఉన్నారట. మాతోపాటు బెజవాడ వరకూ వస్తారట.

మర్నాడు ఉదయం ముందుగా తెముల్చుకొని వాళ్ళదగ్గరకు వెళ్ళాను. స్నేహలత వంగి, పెట్టెతాళం తీస్తోంది. ఆమెను చూస్తోంటే ముందు ముందు ఆమెకు తన శరీరంవల్ల మరీ కష్టపడాల్సిన పరిస్థితి రావచ్చనిపిస్తోంది.

నేను రావడం చూసి ఆమె లేచి నుంచుంది. వాళ్ళాయన లేరు. పిల్లలు ఏవో కావాలని ఏడిస్తే బైటకు తీసుకెళ్ళారట.

"మీకు బాధగా లేదూ?" అన్నాను.

ఆమె నవ్వింది. "ఏం చేయమంటారు. నా అంతట నేను పెంచుకోవడం లేదు. రోజురోజుకూ అదే పెరిగిపోతోంది. అప్పటికీ రాత్రిళ్ళు భోజనం మానేసి ఫలహారం పుచ్చుకొంటున్నాను" అంది.

నాకు ఇందిర జ్ఞాపకానికొచ్చింది. ఇందిర లావెక్కాలనుకొంటోంది. అందుకే కాఫీ టీలు మానేసింది. స్నేహలత సన్నబడాలనుకొంటోంది. రాత్రిళ్ళు భోజనం మానేసింది. కాని యిద్దరూ అనుకున్నట్టు జరగడంలేదు.నాలో నేనే నవ్వుకున్నాను.

"నవ్వుతున్నారేం?" అంది పసిగట్టి.

"ఏమీలేదు. ఇందిరకు సగం మీ శరీరాన్ని యిచ్చేస్తే బావుంటుంది" అన్నాను. ఆమె కేదో జ్ఞాపకం వచ్చినట్టుంది, "అన్నట్టు ఇందిర గోపాలాన్ని పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నదట. మొన్ననే ఉత్తరం రాసింది" అంది.

నే నాశ్చర్యపోయాను: ఇందిర గోపాలాన్ని పెళ్ళిచేసుకోవడమనేది కలలోని విషయంలా అనిపించింది నాకు. ఇది సాధ్యమని నేనెప్పుడూ అనుకోలేదు.

"చాలా ఆశ్చర్యంగా వుంది నాకు" అన్నాను నేను. ఆమె అతి సామాన్యంగా నవ్వి "ఇందులో ఆశ్చర్యపడాల్సినదేమీలేదు. ఆధునిక పద్ధతులంటే ఆమెకు బాగా యిష్టం. ప్రేమించడమంటే ఆమె దృష్టిలో గొప్ప సాహసం, అదో సరదా" అంది.

ఇందిరమీద స్నేహలతకున్న అభిప్రాయంలో నాలుగోవంతు మాత్రమే చెప్పినట్టనిపించింది. తోటి స్త్రీ అనే అభిమానంచేత అంతగా ఏమీ ఆమెను గురించి చెప్పలేదనుకున్నాను. ఆ రోజు ఇందిర స్టేషన్లో గోపాలం ప్రసంగం ఎందుకు తీసుకువచ్చిందో యిప్పుడు అర్థమయ్యింది. గోపాలంమీద నా అభిప్రాయాన్ని తెలుసుకోవాలని ఆమె ఊహ.

గోపాలాన్ని ఆమె ప్రేమించిందన్నమాట!

కాలేజీలో బెంచీలమీద నా పేరు ఇందిర చెక్కివుండదని తేలిపోయింది.

స్నేహలత భర్త, పిల్లలు వచ్చారు. నన్ను చూసి "మీరంతా రెడీ అయిపోయారా" అన్నాడు.

"అయిపోయినట్టే" అన్నాను నేను. అతను గబగబా సామానుల్ని సర్దేశాడు. ఈలోగా నేనుకూడా సామాను సర్దుకొని ఆవిడను తీసుకొచ్చాను. ఒక పెట్టె, చిన్న బెడ్డింగు తప్ప అట్టే సామానులు లేవు మాకు. వాళ్ళను చూస్తొంటే అంత సామానుతో ఎలా బయలుదేరారో ఆశ్చర్యంవేసింది. మరచెంబు, విసనకర్రలతో సహా చిల్లర చిల్లర సామానులు చాలావున్నాయి!

రైల్లో స్నేహలత, ఆవిడ కలసి కూర్చున్నారు. ఈ రెండు రోజుల్లోనూ ఆవిడకు స్నేహలత బాగా పరిచయం అయిపోయింది.

అతను నా ప్రక్కనే కూర్చున్నాడు. కొద్దిసేపు పేపరు చదివి ప్రక్కన పెట్టి వట్టినే అలా బయటకు చూస్తున్నాను. విశాలమైన పచ్చని పొలాలంటే నాకు చాలాయిష్టం. వాటిని చూస్తూ ఎంతసేపయినా గడిపేయగలను.

పాప కిటికీ దగ్గరకువచ్చి కిటికీలోంచి చూస్తోంది. మధ్య మధ్య గట్టిగా అరుస్తూ గెంతుతోంది. స్నేహలతకు భయం ఎక్కువ. పాపను కోప్పడి సరిగా కూర్చోమంటోంది. పాప వినడంలేదు. పాపను దగ్గరకు తీసుకొని "ఫరవాలేదులెండి" అన్నాను ఆమె భయానికి నవ్వుకున్నాను.

పరధ్యాన్నంగా బయటికి చూస్తున్నప్పుడు పాప, "మావయ్యా ఎన్ని ఆవులో!" అంది, దూరంలో ఆవులమందని చూపించి. నాకు ఆశ్చర్యంవేసింది. ఆ విధంగా పాప పిలవడం కొత్తగా వుంది. తనంతట తాను అలా పిలిచిఉండదు. బహుశా స్నేహలతే అలా పిలవమని చెప్పి ఉండాలి.

పాప నన్ను వదిలిపెట్టేట్టు లేదు. బెజవాడ వచ్చేవరకూ నా దగ్గరే కూర్చుంది. బెజవాడలో వాళ్ళు దిగిపోయారు. వాళ్ళను విడిచిపెట్టడం చాలా బాధనిపించింది.

వెళ్ళేముందు ఆయన కరచాలనం చేశాడు. "మిమ్మల్ని గురించి మా స్నేహలత తరచు చెప్తుండేది. ఎప్పుడన్నా మిమ్మల్ని కలుసుకోవాలనుకునే వాడిని. అనుకోకుండా కలుసుకొని, మనం చాలా సన్నిహితులమయ్యాం. మిమ్మల్ని కలవడం, మీతో మూడు రోజులు గడపడం-చాలా సంతోషకరమైన విషయం" అన్నాడు.

నాకు చప్పున స్నేహలత వాళ్ళమ్మకు పరిచయం చెయ్యడం జ్ఞాపకానికొచ్చింది. అప్పట్లో అనుకున్నట్టుగా, ఆ పరిచయం వెనక ఏ ప్రత్యేకతా ఉండిఉండదు. ఆ విషయంలో నేను పొరపాటు పడ్డాను.

బెంచీలమీద అక్షరాలు స్నేహలత చెక్కిఉండదు.

మరో సంవత్సరం గడిచింది. జీవితంలో చెప్పుకోదగ్గ మార్పులేమీ లేవు. రోజులు సంతోషంగానే గడిచిపోతున్నాయి. మిగిలిన రోజులుకూడా యిలాగే గడచిపోతే చాలు. అంతకన్నా నేను కోరేదేమీలేదు. అభిరుచులుకూడా పరిమితమయిపోయాయి. ఉద్యోగం ఇల్లు-జీవితమంతా వీటిచుట్టూ పరిధుల్ని సృష్టించుకొన్నట్లనిపిస్తోంది.

ఉద్యోగరీత్యా బొంబాయి వెళ్ళవలసి వచ్చింది. నేను పనిచేస్తోన్న కంపెనీ తాలూకు టెక్స్టయిలు డిజైను మిషను బొంబాయి వరకూ వచ్చి ఆగిపోయింది. దాన్ని హార్బరునుండి విడిపించి రైల్లో పంపించాలి. మేనేజరు పిలచి నన్ను వెళ్ళమన్నాడు. అక్కడి ఎవరి పేరోచెప్పి, ఆయన్ను కలుసుకుంటే పని వేగంగా అయిపోతుందన్నాడు. అతనిపేర ఉత్తరంరాసి, నా చేతికిచ్చాడు.

బొంబాయి వెళ్ళాక మేనేజరు ఇచ్చిన అడ్రసుప్రకారం అతన్ని కలుసుకునేందుకై వెళ్ళాను. బయట ఎవరో ఆడామె ఉంది. నన్ను చూడగానే లోపలకు వెళ్ళిపోయింది. పనిమనిషి గాబోలు వచ్చి "ఆయన లేరు" అని చెప్పింది. వెళ్ళిపోదామని వెనక్కు తిరిగాను. లోపలినుంచి ఆమె ఏదో చెప్పినట్టుంది, పనిమనిషి డ్రాయింగు రూం తలుపు తీసి "వారు వచ్చే టయిమయింది, పోనీ కూర్చోండి" అంది . ఆయనకోసం మళ్ళీ రావడం యిష్టంలేక వెళ్ళి కూర్చున్నాను.

ఒక్కసారిగా మల్లెపూల వాసన వేసింది. గదిలో. ఎక్కడన్నా అవి ఉన్నాయేమోనని చుట్టూ చూశాను. ఏవీ కనిపించలేదు. అయిదు నిమిషాల తరువాత ఎదురుగా ఉన్న కిటికీ వెనక గాజులు గలగలమన్నాయి. అటువయిపు చూస్తే కొద్దిగా తెరచిన కిటికీ సన్నని చారలోంచి చీరపవిట కనిపించి మాయమయ్యింది.

అతను వచ్చాడు. మేనేజరు యిచ్చిన ఉత్తరం చూపించాను. అందులో నన్ను పరిచయం చేసినట్టున్నాడు, చిన్న చిరునవ్వు నవ్వి నాతో కరచాలంచేసి "సరేలెండి, మధ్యాహ్నం వెళ్ళి ఆపని చూద్దాం" అన్నాడు.

భోజనానికి అక్కడ ఉండిపొమ్మన్నాడు గాని ఉండలేదు. మధ్యాహ్నం వెళ్ళి అతన్ని కలుసుకున్నాను. సాయంకాలంవరకూ యీ పనిమీదనే తిరిగాం. మొత్తంమీద పని పూర్తయ్యింది.

మరునటిరోజు అక్కడ నుండి వచ్చేసేముందు ఆయన్ను ఒకసారి కలుసుకోవాలని పించింది. కాఫీ పుచ్చుకుని ఉదయాన్నే అక్కడకు బయలుదేరాను. నవ్వుతూ సరదాగా మాట్లాడడం ఆయనలో ఒక ప్రత్యేకత. వయసు ముప్పయి ఏళ్ళకు

మరో రెండు మూడు ఎక్కువగా ఉంటాయి, బట్టతల మరికాస్తా పెద్దవాడిలా చూపిస్తుంది.

నేను వెళ్ళేసరికి అతను యింట్లో లేడు. ఉదయమే పనిఉందని వెళ్ళిపోయాడట. అతని భార్యగాబోలు వచ్చి సమాధానం చెప్తోంది. నిన్న నన్ను చూసి లోపలకు వెళ్ళిపోయినదికూడా ఆవిడే. ఆమెను ఎక్కడో చూసినట్టనిపించింది. ఆ విషయం ఆమెను అడగడం సభ్యతకాదని ఆలోచిస్తున్నాను. ఆమె నవ్వుతోంది. "గుర్తుపట్టారా?" అంది.

నాకు చప్పున జ్ఞాపకం వచ్చింది. నాతో రెండేళ్ళు కలిసి చదివినా ఆమెను అంతసేపటివరకూ గుర్తుపట్టలేకపోయినందుకు సిగ్గుపడాల్సివచ్చింది. ఆమె కళావతి! నా క్లాస్‌మేట్!

ఆమెలో చాలా మార్పు వచ్చినట్టనిపించింది. బొంబాయి నాగరికతకు అలవాటుపడ్డ మనిషిలా వుంది. తలకు హెయిర్ నెట్ పెట్టుకుంది. చెవులకు గుండ్రని రింగులు వేలాడుతున్నాయి. మెడలో సన్నని గొలుసు తప్ప యింకేమీలేవు. చేతికి చిన్న రిస్టువాచి ఉంది. పూర్వపు కళ్ళజోడు లేదు. అందువల్లే మరీకొత్తగా వుంది.

"చాలా మారిపోయారు" అన్నాను.

ఆమె నవ్వింది. 'మీరు మాత్రం నాకేమీ మారినట్లనిపించలేదు. నిన్న మిమ్మల్ని చూసినప్పుడే అనుమానం వేసింది. రాత్రి వారు వచ్చినతరువాత అడిగాను. అనుమానం నిజమే అయింది" అంది.

ఆమె లోపలకు తీసుకెళ్ళింది. కొద్దిసేపట్లో టిఫిను, కాఫీ తెచ్చి యిచ్చింది . ఎదురుగా ఉన్న కుర్చీలో ఆమె కూర్చుంది. కాఫీ తాగుతూ ఆమెను గురించి ఆలోచిస్తున్నాను.

నా కెందుకో వాళ్ళిద్దరి జంటా అదోలా అనిపించింది. వాళ్ళ మధ్య విపరీతంగా వయసులో తేడా కనిపిస్తోంది. వాళ్లిద్దరూ సినిమాలకూ, షికార్లకూ తరచు వెళ్తుంటారని అనుకోలేకపోతున్నాను.

ఆ ఇంట్లో పిల్లలు ఉన్నజాడ నాకేమీ కనిపించలేదు.

"పిల్లలా?" అన్నాను.

లేదన్నట్లు తల ఊపింది. ఆ విషయం తెలియజేసినప్పుడు ఆమె కొద్దిగా బాధపడినట్టే అనిపించింది. ఆ ప్రశ్న అడుగకుండా వుండాల్సింది.

"ఆయన చాలా సరదా అయిన మనిషి. మీకు మంచి కాలక్షేపం" అన్నాను

ఆమెను నా ప్రశ్నతో మనసు నొప్పించానేమోనని. ఔనన్నట్టు తలూపింది. ఆ తర్వాత ఒక్కసారిగా నిశ్శబ్దంలోకి జారిపోయింది.

"మనం అనుకున్నవన్నీ జరగవు. జరిగితే దేవతలమే అయ్యేవాళ్ళం. జీవితంలో తృప్తి పడడం నేర్చుకోవాలి కదా" అంది ఆమె అకస్మాత్తుగా.

తలఊపి "నిజమే" అన్నాను. ఆ తర్వాత ఇంకేమీ మాట్లాడలేదు.

జ్ఞానసుందరి గురించి ఆమెనుఅడగాలనిపించింది. కళావతి ఎదురుగా జ్ఞానసుందరి నన్ను పొగుడుతుండేదట. ఆ విషయం ఇందిర చెప్పింది. కళావతిని యిప్పుడు అడిగితే ఏమన్నా కొత్త సంగతులు చెప్పవచ్చు. ఆ విషయం తప్పకుండా తెలుసుకోవాలనే అభిరుచి లేదు గాని, యింతవరకూ వచ్చి, అది తెలుసుకోకపోవడ మేమిటి?

"జ్ఞానసుందరి యిప్పుడెక్కడుంటున్నదో తెలుసా?" అన్నాను.

"ఏలూరులో ఉంటోంది. అక్కడ కాలేజీలో పనిచేస్తోందట. ఈమధ్యనే ఆమె వద్దనుండి ఉత్తరం వచ్చింది. చూపిస్తా, ఉండండి" అంటూ లోపలకు వెళ్ళి ఉత్తరం తెచ్చి చదవమని యిచ్చింది.

మరొకరి ఉత్తరాలు చదివే అలవాటు నాకులేదు.

"చదవక్కరలేదు లెండి, ఏమిటి రాసిందీ చెప్తే చాలు" అన్నాను.

"ఫరవాలేదులెండి, అందులో రహస్యాలు ఏమీలేవు" అంది.

ఉత్తరం తీసుకుని చదివాను.

"ప్రియమైన కళా-

నీ ఉత్తరం అంది చాలాకాలమైనా మనసు బాగుండక వెంటనే సమాధానం ఇవ్వలేకపోయాను. ఏమిటో రోజులు చాలా బరువుగా దొర్లుతున్నట్లనిపిస్తున్నాయి. పూర్తిగా ఆనందాన్ని పొందలేకపోతున్నాను. కారణం ఏమిటో తెలీదు. ఇక్కడి మనుషులంటే నాకు అసహ్యం. వారికి నా యోగక్షేమాలు తెలుసుకోవడంకన్న వేరేపనేమీ లేనట్టుంది. నా శ్రేయస్సే వాళ్ళకు ప్రధానమైనట్టు నా ఎదురుగా నటిస్తుంటారు. వాళ్ళప్రవర్తనతో రోజురోజుకు విసిగిపోతున్నాను. సాధ్యమైనంత త్వరగా యిక్కడినుండి మరో చోటికి ఎక్కడికన్నా ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలని ఉంది. అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తూఉండు.

నీ ప్రియమైన
జ్ఞానసుందరి"

ఉత్తరం చదివి ఆమె చేతికిచ్చాను. అందుకొని "పాపం? ఆమెను చూస్తుంటే జాలేస్తుంది. పెళ్ళి చేసుకొంటే యిన్ని సమస్యలు ఉండకపోనేమో" అంది కళావతి.

నేను ఆశ్చర్యపోయాను. ఆమె యింతకాలంవరకూ పెళ్ళిచేసుకోకుండా ఉంటుందని అనుకోలేదు.

"ఆమె యింకా పెళ్ళిచేసుకోలేదా?" అని అడిగాను.

లేదన్నట్లుగా ఆమె తల ఊపింది. ఆ తర్వాత ఆవిడే "ఆమె పెళ్ళిచేసుకోకుండా ఉండడానికి నాకు కారణం ఏమీ కనుపించడంలేదు. చాలా విచిత్రమైన మనిషి. గతాన్ని తలంచుకుని ఎప్పుడూ బాధపడుతుంది" అంది.

ఆ 'గతం' ఏమిటో నాకు తెలుసు. కాని అంతమాత్రం చేత ఆమె అలా బాధపడడం నాకేమీ నచ్చలేదు. వట్టి పిరికిమనిషిలా అనిపించింది. ఆ విషయమే కళావతితో అన్నాను. "జ్ఞానసుందరి పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కోలేదు, వట్టి పిరికి మనిషి" అని.

ఆమె తల ఊపింది. "నిజమే కాని, పిరికి వాళ్ళయినంత మాత్రంచేత అంతా ఆమెలా ప్రవర్తిస్తారని నేను అనుకోను. చాలామంది జీవితంలో కోర్కెలు ఫలించక నిరాశ ఆవరించిన వాళ్ళే. గతాన్ని తలంచుకొని బాధపడుతూ వారంతా గడపరు. తృప్తి అనేదాన్ని ఏర్పరుచు కుంటారు. అప్పుడే కొంతవరకు గతాన్ని మర్చిపోవడానికి ఆస్కారముంటుంది" అంది.

ఆ విషయం ఆమె చెప్తున్నప్పుడు ఆ నిర్ణయం మీద ఆమె స్థిరచిత్తం ఎలా పనిచేసినదీ తెలుస్తోంది. అంత గంభీరంగా ఆమె మాట్లాడుతుందని నేను అనుకోలేదు.

జ్ఞానసుందరి గురించి నాకు కావలసిన సమాచారమంతా అందింది. మరొక్క సంగతి తెలియాలి. "ఆమె నా గురించి మీతో తరచు చెపుతూ, నన్ను పొగుడుతుండేది కదూ" అన్నాను.

ఆమె తల ఊపింది.

ఇక జ్ఞానసుందరిని గురించి తెలుసుకోవలసినదేమీ లేదు. అంతా తెలిసిపోయింది. ఆమె ఏమని పొగిడేదీ ఊహించవచ్చు.

జ్ఞానసుందరి నన్ను ప్రేమించిందనే విషయం తెలిసిపోయింది.

ఇప్పుడు మనసు చాలా తేలికగా వుంది. నేను అనుమానించినట్టే అయ్యింది.

ఇన్నేళ్ళ తర్వాత యీ విషయం వెల్లడై ఒకసమస్య తీరిపోయింది. నేనూ ప్రేమించబడ్డాను! అలా అనుకోవడం ఒక రకమైన ఆనందమేకాదు గర్వంకూడా.

చాలాసేపు మౌనంగా గడిచిపోయింది. సంభాషణలను పొడిగించడం నాకు చేతకాదు. ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆమెకూడా ఏమీ మాట్లాడలేదు. పెన్సిలుతో స్టూలుమీద వట్టినే పిచ్చిగీతలు గీస్తోంది.

నేను వచ్చి గంటన్నర కావస్తోంది. ఆయన ఇంకా రాలేదు. వెళ్ళిపోదామని లేచాను. ఆమె విచిత్రంగా చూసి "ఏమిటి! వెళ్ళిపోతున్నారా! లాభంలేదు, భోంచేస్తేనేగాని మిమ్మల్ని వెళ్ళనిచ్చేదిలేదు" అంది.

ఆమె అంత ఆప్యాయంతో కోరుతున్న కోర్కెను తిరస్కరించక తప్పలేదు. మధ్యాహ్నం బండికి వెళ్ళిపోక తప్పదు. ఆమెకు నా క్షమాపణలు చెప్పుకున్నాను. వెళ్ళిపోతున్నందుకు ఆమె చాలా బాధపడింది.

"ఉండండి, కొద్దిగా మజ్జిగయినా పుచ్చుకొని వెళ్ళుదురుగాని" అంటూ లోపలికి వెళ్ళి గ్లాసుతో మజ్జిగతెచ్చి యిచ్చింది.

గ్లాసు కాళీచేసి స్టూలుమీద పెడుతున్నప్పుడు నాకళ్ళను నేనే నమ్మలేక పోయాను. స్టూలుమీద పెన్సిలుతో గీసిన పిచ్చిగీతల మధ్య నా పేరు రాసి ఉంది! ఆశ్చర్యపోయాను.

చప్పున కాలేజీలో బెంచీలమీద చెక్కిన అక్షరాలు జ్ఞాపకానికి వచ్చాయి. ఏమిటో విచిత్రంగా ఉంది నాకు. అంతకుముందు ఆమె అన్నమాటలు ఎవరికి అన్వయిస్తాయో యిప్పుడు కొద్దికొద్దిగా తెలుస్తోంది. కాని ఆమెనన్ను ప్రేమించి ఉంటుందని అనుకోలేకపోతున్నాను. ఆమెతో నాకు ఏ మాత్రం పరిచయం ఉండేది కాదు. కనీసం ఆమె ఎవరో నేనెప్పుడూ తెలుసుకొనేందుకైనా ప్రయత్నించలేదు.

మరోరోజు అక్కడే ఉంటే ఆ విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమైన పనేమీ కాదు. కాని వెళ్ళిపోతానని చెప్పి తిరిగి ఉండిపోవడంలో అర్థంలేదు. ఆమె వద్ద సెలవు తీసుకొని బయలుదేరాను.

స్టేషనుకు వెళ్ళి టిక్కట్టు కొనేముందు ఒకసారి జ్ఞానసుందరిని కలుద్దామనిపించింది. ఆమెనుకూడా చాలా కాలంనుంచి కలుసుకోలేదు. ఆమె ఉంటున్న ఊరు తోవలోనే గనుక ఒకసారి దిగి కలుసుకుందామని నిర్ణయించుకున్నాను.

టిక్కెట్టు ఏలూరుకు తీసుకున్నాను.

ఏలూరు వచ్చాక, క్లోకురూములో సామానుంచి జ్ఞానసుందరిని కలుసుకొనేందుకై కాలేజీకి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి ఆమె క్లాసులో ఉంది. అరగంటసేపు ఎదురుచూశాక గంటకాగానే ఆమె బయటకు వచ్చింది. నన్ను చూసి ఆశ్చర్యపోయింది. "ఏమిటి! ఎప్పుడొచ్చారు"? అంది.

నాప్రయాణం గురించి ఆమెకు చెప్పాను.

ఇద్దరం స్టాఫ్‌రూంలోకి వెళ్ళాం. లోపల అంతా విచిత్రంగా మావైపే చూస్తున్నారు. ఆ చూపుల్ని భరించడం కష్టం అనిపించింది. ఎలాగో ఓపిక పట్టి కూర్చున్నాను.

"ఇప్పుడు చెప్పండి. ఏంచేస్తున్నారు? పెళ్ళయిందా? పిల్లలెంత మంది? కళావతి ఏమంటోంది? ...." గుక్క తిప్పుకోకుండా ప్రశ్నలన్నీ ఒక్కసారే వేసేసింది.

అన్నిటికీ మెల్లగా సమాధానం చెప్పుతూ కూర్చున్నాను.

వైజాగ్‌లో ఉంటుండగా నేను రాసిన ఉత్తరానికి సమాధానం ఎందుకు రాయలేదో అడిగాను. ఆ ఉత్తరం ఆమెకు అందలేదట, నేను కలుసుకున్న తర్వాత కొద్దిరోజులకే వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయిందట.

"కళావతి మీకు ఎలా కలిసింది?" అంది.

చెప్పాను.

"చాలా గంభీరమైన మనిషి, ఏ విషయంలోనూ సులభంగా బైటపడేరకం కాదు" అంది తిరిగి ఆమె.

ఆమె ఏవిషయాన్ని పురస్కరించుకొని అలా అన్నదో అర్థమయ్యింది. కళావతిని గురించి జ్ఞానసుందరిని అడిగి మరికొంచెం తెలుసుకుంటే బావుండును.

" ఆ రోజుల్లో ఆమె నాగురించి మీతో ఏమన్నా చెప్పేదా?" అన్నాను.

"లేదు" అంది ఆమె. కొద్దిసేపు మౌనంగా ఊరుకొని-

"కాని , ఒకరోజు ఆమె నోట్సు తీసుకున్నాను. లోపల ఒకచోట మీ పేరు రాసి కొట్టేసి వుంది" అంది తిరిగి.

నాకంతా పూర్తిగా అర్థమయిపోయింది. చాలాకాలంగా సమస్యగా ఉండిపోయిన ఒక విషయం యివ్వాల్టితో తీరిపోయింది. ఆరేళ్ళ అనంతరం విచిత్రంగా ఈ సమస్య పరిష్కారమయింది. చీకటి మడతలు విచ్చుకున్నాయి. ఇందిర, జ్ఞానసుందరి, స్నేహలత, కళావతి - యీ నలుగుర్లో అసలు కారకులెవరో తెలిసిపోయింది.

నేను ఊహించినట్టు జ్ఞానసుందరి నన్ను ప్రేమించింది. అందులో అబద్ధం లేదు. కాని యిప్పుడు మరో కొత్త విషయం తెలిసింది. కళావతి కూడా నన్ను ప్రేమించింది. బెంచీలమీద నా పేరు చెక్కినది కళావతే- ఇద్దరూ రహస్యంగా ప్రేమించారు. వ్యక్తంచేసే ధైర్యం యిద్దరికీ లేదు. ఈ విషయంలో యిద్దరూ పిరికివాళ్ళే.కాని కళావతి మాత్రం గంభీరమైన మనిషి. ప్రేమిస్తున్నట్లు ఎవరికీ చెప్పలేదు. కనీసం ఇందిరకుకూడా చెప్పిఉండదు. జీవితంలో తృప్తిపడి సంతోషంగా బతకడం నేర్చుకుంది. అది జ్ఞానసుందరికి సాధ్యంకాలేదు. గతాన్ని మర్చిపోలేకపోతోంది.

నాకుచెప్పలేనంత ఆనందమయ్యింది. ఇరువురి చేత ప్రేమించబడ్డాను! అదోరకమైన గర్వం.

మరికొద్దిసేపు ఆమెతో మాట్లాడి అక్కడనుండి బయలుదేరాను. ఆమె కాలేజీ ఆవరణ వరకూ వచ్చి ఆగిపోయింది.

"మీరు యిక పెళ్ళిచేసుకోరా?" అన్నాను. నవ్వింది కాని సంతోషంగా నవ్వలేదు. "ఇలాగే ఉండిపోదా మనుకొంటున్నాను" అంది.

రిక్షా పిలిచాను. వచ్చింది. లోపల కూర్చుని "మీరునిజంగా సంతోషించడం లేదు. మరొకరి మీద కక్షతో మిమ్మల్ని మీరే బాధించుకొంటున్నారు. అది మంచిపని కాదు" అన్నాను.

రిక్షా కదిలింది.

"సరేలెండి, పెళ్ళిచేసుకోవాలనే అభిప్రాయమే గాని కలిగితే తప్పకుండా చేసుకుంటాను"అంది.

రిక్షా చాలాదూరం వెళ్ళిపోయిన తర్వాత ఒకసారి వెనక్కుతిరిగిచూశాను. ఆమె అక్కడే నిలుచొని ఉంది!